

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | ఆదివారం | 18-10-2026 | సంపుటి: 3 | సంచిక: 254 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 18-10-2026 | VOLUME : 3 | ISSUE : 254 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575





# పల్లెబాట పట్టిన పట్నం

- దసరా పండుగతో సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- ఎంజీబీఎస్, జేబీఎస్‌లో భారీగా ప్రయాణికుల రద్దీ
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు
- శివారు ప్రాంతాల నుంచే సొంతూర్లకు వెళ్లే సదుపాయం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం

హైదరాబాద్, అక్టోబర్ 17:
దసరా పండుగ నేపథ్యంలో భాగ్యనగరం నుంచి పల్లెలకు జనప్రవాహం మొదలైంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో ఎటు చూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోవడంతో రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రెండు రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు**
పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లే మార్గాల్లోనూ అదనపు సర్వీసులు

మిగతా 2వ పేజీలో..



## మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- నవంబర్ చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 17 :
భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల

మిగతా 2వ పేజీలో..




## గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు మద్దతు పలుకుతున్న రేవంత్
- తెలంగాణ ద్రోహులను మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- కావేరి ముసుగులో తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో పది మోటర్లు ఎందుకు నడవలేదు?
- నిప్పులు చెరిగిన హరీష్ రావు

3



## ఆడబిడ్డలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- ఆడబిడ్డలకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు
- తెలంగాణ వైభవానికి, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- సామాజిక న్యాయం, మహిళల ఐక్యతకు సంకేతం: భట్టి
- ఆడబిడ్డల సంక్షేమానికే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

3

## మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

- డీజీపీ ఆనంద్
- రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీ




హైదరాబాద్, అక్టోబరు 17 :
డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టి, యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీజీపీ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన శనివారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివాస్) సందర్భంగా సీఆర్పీఎఫ్ నోడల్ ఏజెన్సీగా

మిగతా 2వ పేజీలో..

## 315 మండలాల్లో కరువు పరిస్థితులు

- కేంద్రం తక్షణ సహాయం అందించాలి
- సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- 'ఖేత్ బచావో అభియాన'పై వీసీలో పాల్గొన్న మంత్రి తుమ్మల



హైదరాబాద్, అక్టోబర్ 17 :
వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర వ్యవసాయ,

మిగతా 2వ పేజీలో..



## ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

- మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి
- ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

2



## తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా నీటి ఎద్దడి రానివ్వం
- పక్కాగా ముందస్తు కార్యాచరణ అమలు
- 23న సింగూరు రిజర్వాయర్‌పై ప్రత్యేక సమావేశం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

2



## ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

2

## మహిళలతో వివాహేతర సంబంధాలు..

- ఆర్మీ మేజర్‌కు షోకాజ్ నోటీసులు
- సైనిక అధికారుల భార్యలతోనూ సంబంధాలున్నాయంటూ ఆరోపణలు
- సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ కోరిన ఆర్మీ చీఫ్
- కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలకు సిద్ధమైన సైన్యం

4

## విద్యార్థులు, మహిళలపై పోలీసుల వేధింపులు

- ఢిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపులు జరిగాయని విమర్శ
- బాధ్యులపై చర్యలకు ఆధారాలు సేకరించాలని సూచన
- కేరళ, రాజస్థాన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు

4

## న్యాయం కోసం ధైర్యంగా నిలబడండి: సీజేఐ సూర్యకాంత్

- రాజ్యాంగ విలువలు, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలి
- న్యాయవాదులు నిజాయతీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి
- న్యాయవిద్యార్థులకు దేశం ఆశాకిరణాలుగా చూడాలి



4

# 315 మండలాల్లో కరువు పరిస్థితులు

**మొదటిపేజీ తరువాయి**

రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 22 నుండి నవంబరు 30 వరకు నిర్వహిస్తామని, అఖిల భారత వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని తమ ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనె గింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధరపై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (పీఎసఎస్) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. వీబీ జీ రామ్‌జీ ప□థకం కింద నిధుల కేటాయింపును పెంచడంతోపాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతోపాటు పండించిన పంటలకు మార్కెట్‌లో కొనుగోలు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

**హైదరాబాద్, అక్టోబర్ 17:**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఎర్రమంజిల్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల వారీగా నీటి నిల్వలు, ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితులు, ఈ వేసవిలో ఎదురయ్యే అవసరాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**తాగునీటికే మొదటి ప్రాధాన్యత**

నవంబర్ 1 లోపు సాగునీటి అవసరాలు తీరిన అనంతరం రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా అత్యవసర పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పంపులను సమీకరించి కనీసం వంద పంపులను అందుబాటులో ఉంచాలని, పనిచేయని పంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**గ్రామస్థాయి నుంచే వేసవి కార్యాచరణ**

రానున్న యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిచ్చేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి వేసవి కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. రెండో వారంలో మండల స్థాయిలో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని హ్యాబిటేషన్‌ల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వినియోగానికి సిద్ధం చేయాలని చెప్పారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పనులను పూర్తి చేయాలని, అవసరమైనచోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**సింగూరు ప్రభావిత జిల్లాలపై ప్రత్యేక సమీక్ష**

సింగూరు రిజర్వాయర్ మినహా ఇతర రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌పై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలు, నీటి వనరుల సమర్థ వినియోగం, నిరంతర పర్యవేక్షణతో రానున్న వేసవిలోనూ ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, వివిధ స్థాయిల చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

**పైప్‌లైన్ లీకేజీలపై నిర్లక్ష్యం వద్దు**

అందుబాటులో ఉన్న నీటిని ప్రతి చుక్కా విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఇతర శాఖలు రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టే సమయంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల కారణంగా పైప్‌లైన్లు దెబ్బతింటే సంబంధిత శాఖలే బాధ్యత వహించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్లు దెబ్బతిన్న సందర్భాల్లో వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్ మరమ్మతులకు అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఇందుకోసం వీబీ జీ రామ్ జీ నిధులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

**అత్యవసర నిధులతో తక్షణ చర్యలు**

తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్న అత్యవసర నిధులతోపాటు ఎస్‌డీఎఫ్ నిధులను కూడా నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించేలా అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

# ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు కార్యక్రమం సద్దుల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు బీఆరఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో రాష్ట్రవ్యాప్తంగా సందడి నెలకొన్నదన్నారు. 'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదని, వారి కృషిని, త్యాగాలను గుర్తించిన నాటి బీఆరఎస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఎలాంటి కష్టం కలగకుండా చూస్తూ వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే బతుకమ్మ పండుగ స్ఫూర్తిని కొనసాగించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# పల్లెబాట పట్టిన పట్నం

**మొదటిపేజీ తరువాయి**

నడుపుతున్నారు. బస్టాండ్లలో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను పంపిస్తున్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా అవసరమైన సహాయం అందించడంతోపాటు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారు.

**శివార్ల నుంచే సొంతూర్లకు..**

నగరంలోని ప్రధాన బస్టాండ్ల వద్ద రద్దీ, ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. విజయవాడ, సూర్యాపేట, ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బెంగళూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ మార్గాల్లో వెళ్లేవారికి ఆరాంఘర్ నుంచి సర్వీసులు అందుబాటులో ఉంచింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లేవారి కోసం జేబీఎస్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో బస్సులు ఏర్పాటు చేసింది. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులు సొంతూళ్లకు వెళ్లేందుకు కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లు కల్పించింది. దీంతో నగరం నడిబొడ్డుకు చేరుకోకుండానే ప్రయాణికులు తమ ప్రాంతాలకు సమీపంలోని



పాయింట్ల నుంచి బస్సులు ఎక్కే అవకాశం లభిస్తోంది.

**మహిళలకు మహాలక్ష్మి అండ**

పండుగ ప్రయాణాల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం ఉపశమనం కలిగిస్తోంది. నిబంధనల ప్రకారం అర్హులైన మహిళలు పథకం వర్తించే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రత్యేక సర్వీసుల్లోనూ అర్హతకు సంబంధించిన గుర్తింపు కార్డులు చూపించి జీరో టికెట్లు పొందేలా కండక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి ఊళ్లకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను తగ్గిస్తోంది. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచడంతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పట్నం నుంచి పల్లెల వైపు సాగుతున్న ఈ ప్రయాణాల నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.

# మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

**మొదటిపేజీ తరువాయి**

సమన్వయంతో దేశవ్యాప్తంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారినపడి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి అన్నారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ సమన్వయంతో డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.దేశంలోని భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే అందరి లక్ష్యమని పేర్కొన్నారు. ఐక్యత, సామాజిక బాధ్యతను చాటిచెప్పడంతోపాటు డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఉద్దేశంగా మాదకద్రవ్యాలపై పోరాటం అనే ఇతివృత్తంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ మాదక ద్రవ్యాల రహిత భారత్, నషా ముక్త్ భారత్ సహకారానికి అందరం కలిసి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ వివరించారు. తెలంగాణ పోలీస్ సిబ్బంది కూడా రైడ్ లో పాల్గొన్నారు. రైడర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవాలని డీజీపీ సూచించారు. ర్యాలీలో పాల్గొంటున్న బైక్ రైడర్లు వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణించి అక్టోబరు 30 నాటికి గుజరాత్‌లోని కెవడియాకు చేరుకోనున్నారు. 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్కడ నిర్వహించే జాతీయ ఐక్యతా/రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య,హైదరాబాద్ సిపి సజ్జనార్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్, నార్కటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్ తో పాటుగా పోలీసు అధికారులు సిబ్బంది, ఎన్ సి సి విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనల మేరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని మహిళలందరికీ ఆమె ఆహ్వానం పలికారు. ఆడపడుచులందరికీ పేరుపేరునా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఒక పండుగేకాక తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, ప్రజల జీవన విధానాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంపదను చాటిచెప్పే అరుదైన సాంస్కృతిక వేడుక అని అన్నారు. పూలతో చెరువులను శుద్ధి చేసుకుంటూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సాధారణంగా పూలతో దేవుళ్లను పూజిస్తామని, కానీ పూలనే దేవతలుగా భావించి పూజించే ప్రత్యేకమైన సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుందని వివరించారు. నవధాన్యాలను ప్రసాదాలుగా పంచుకుంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో అంతర్భాగమన్నారు. ఆత్మీయత, అనురాగాలను కలబోసుకుని, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మహిళలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ అని సీతక్క తెలిపారు. ఈ వేడుక మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందిస్తున్నారని, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ప్రత్యేకతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెద్ద బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్‌లోని మహిళలందరూ తరలిరావాలని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆహ్వానించారు. మీ సీతక్కగా మీ అందరినీ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్నాను.. తెలంగాణ ఆడపడుచులందరికీ స్వాగతం.. సుస్వాగతం అని అన్నారు.



# మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

**మొదటిపేజీ తరువాయి**

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూ సర్వే పురోగతిపై సచివాలయంలో రెవెన్యూ అధికారులతో శనివారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయన్నారు. ప్రజల సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకుని మొత్తం 2,720 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుకు భూమి ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతోపాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీ సర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉప విభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందని అన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీ సర్వే చేపడుతున్నట్లు వివరించారు. గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతోపాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు.

**త్వరలో పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ**

రీ సర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతోపాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాల్లో వంద శాతం రీ సర్వేను విజయవంతంగా పూర్తిచేశామని, త్వరలో భూదార్ పట్టాలు పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ముందుగానే తెలియజేయడం ద్వారా భూ యజమానులు అందుబాటులో ఉండేలా తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీ సర్వేను అధికారులు ప్రభుత్వ విధిగా భావించకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి సూచించారు.

# గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

హైదరాబాద్, అక్టోబర్ 17:

నవంబర్ 3న ఢిల్లీలో జరగనున్న ఎన్డబ్ల్యూడీఏ మీటింగ్ ఎజెండాలో గోదావరి కావేరి లింకును చేరుస్తూ రాష్ట్ర నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారు. అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నదని బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ భవన్లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గోదావరి కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని చంద్రబాబు ఈనెల 7న లేఖ రాయగానే ఎజెండాలో పొందుపరిచి నవంబర్ 3న మీటింగ్ పెట్టారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కుక్కిన పేనుల్లా పడి ఉన్న తెలంగాణ ద్రోహులంతా ఇవాళ మళ్ళా నిద్రలేచారు. పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టుతో గోదావరి జలాలను అక్రమంగా ఆంధ్రకు తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడిన మరుక్షణం నుంచే చంద్రబాబు గోదావరి జలాల దోపిడీ మొదలు పెట్టిండని ఆరోపించారు. కోవర్టు రేవంతు తెలంగాణ నీటి హక్కులు నిండా ముంచుతున్నడు. గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వ మొద్దు నిద్రలో ఉంటే ఆ ఎత్తులను బిఆర్ఎస్ చిత్తు చేస్తూ వస్తున్నది. గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు తొలుత పోలవరంబనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. ఆ తర్వాత నల్లమలసాగర్గా పేరు మార్చారు. ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి దానిని గోదావరికావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి కావేరి ముసుగులో మూడో ప్రతిపాదనకు తీసుకువచ్చారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేసిండు. గోదావరి బనకచర్ల, గోదావరి నల్లమల సాగర్ ఫెయిల్ కావడంతో మొత్తం తెలంగాణ నదీ జలాలను కబలించే కుట్ర ఇది. అడ్డుకోవాల్సిన రేవంత్ రెడ్డి పూర్తిగా దాసోహం అంటున్నడు. పోలవరం నుంచి కావేరికి నేరుగా కలిపి అనుసంధానంలో తెలంగాణ లేకుండా చేసారు. కేసీఆర్ హెచ్చరించినట్టు 'కత్తి పరాయి వాడిదే కానీ..పొడిచే చెయ్యి' మనోడిదే! 'చెయ్యి' తెలంగాణ నోట్లో మట్టికొడుతున్నది.

**ఇది జాతి ద్రోహం**

'గురుదక్షిణ అని నువ్వు అనుకుంటున్నవు, కానీ ఇది అంతకు మించిన జాతి ద్రోహం. నువ్వు చేస్తున్న జల ద్రోహానికి భవిష్యత్ తరాలు కూడా నిన్ను క్షమించవు రేవంత్ రెడ్డి' అన్నారు. బనకచర్ల విషయంలో మేం అనేకసార్లు హెచ్చరించినం.. చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలని చెప్పినం. మా గురువు మా గురువు అంటూ గోదావరి జలాలను వదలిపెట్టిండు. ఇప్పుడు అసలుకే ఎసరు వచ్చింది. ఈ రేవంత్ రెడ్డి.. ఇన్నాళ్లూ మనకు నీళ్లు ఉన్నా.. నీటి హక్కులు ఉన్నా వినియోగించలే దు. ఇప్పుడు ఏకంగా నీటి హక్కులే లేకుండా చేస్తున్నడు. ఇప్పటికే రిజర్వాయర్లలో నీటి నిల్వ లేదు, పంటలకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. ఎల్ నినో ఎఫెక్ట్ ఉంటుందని 9 నెలల నుంచి మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైన రేవంత్ రెడ్డి నేడు ఎల్ ని నో పేరు చెప్పి చేతులెత్తేసిండు. రైతులు, ప్రజలను మీ సావు మీరు సావండి అంటున్నడు. ఇంక 'ఏదైనా కొనగలం కానీ నీళ్లను కొనలేం అంటున్నడు'. మరి అంతటి ప్రాధాన్యం గల నీళ్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నవు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.




దేవాదులలో నీళ్లు వస్తున్నయి. పది మోటార్లు నడవాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నావు అని నిలదీసినం. తెలంగాణ భవన్ లో మాట్లాడినం, వరంగల్ జిల్లాలో మాట్లాడినం. ఈరోజు పైసలు పెట్టి ఏదైనా కొనొచ్చు, నీళ్లు కొనలేం అంటున్నడు. దేవాదులలో పదికి పది మోటార్లు ఎందుకు నడపలేదు? అది చేసుంటే ఈరోజు వరంగల్ లో కరువు వచ్చేది కాదు కదా అన్నారు. ఏపీలో కరువు లేదు. తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఏపీలో నమోదైంది. కానీ అక్కడ క్రాప్ హాలిడే లేదు, ఇక్కడ మాత్రం పంటలు వేయొద్దు అంటున్నవు. దేవాదులలో 10 మోటార్లు నడిపితే చెరువులు, చెక్ డ్యాంలు, రిజర్వాయర్లు నిండేవి కరువు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు నిల్వ ఉన్నా లిఫ్ట్ చేయలేదు. 5 మోటార్లు ఉన్న కల్వకుర్తిలో 3 మోటార్లు 7,8 గంటలు నడిపావు. నువ్వు వదిలిపెడితే చంద్రబాబు 700 కి.మీ దూరంలో ఉన్న కుప్పానికి నీళ్లు తీసుకువెళ్లాడు. ఏపీలో జలహారతి, తెలంగాణలో కన్నీళ్ల హారతి. పాలమూరుకు, తెలంగాణకు కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ తెచ్చిన కరువు. కన్నెపల్లిలో మోటార్లు నడపాలని డిమాండ్ చేస్తే నడపలేదు. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి కాలయాపన చేసినవు అని హరీష్రావు ఆరోపించారు. నీళ్లు లిఫ్ట్ చేయడం రాష్ట్ర నిర్ణయం మాకు సంబంధం లేదు అని హైకోర్టులో ఎన్డీఎస్ఏ అఫిడవిట్ వేసి చెంప చెళ్లుమనేలా చెప్పింది. సిడబ్లుపిఆర్ఎస్ తన నివేదికలో అన్నారం, సుందిళ్ల అద్భుతంగా ఉన్నాయని చెప్పాయి. కన్నెపల్లిలో నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా, తెలంగాణకు, హైదరాబాద్ కు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా రాజకీయాలు చేస్తూ లేని కరువు తెచ్చినవు రేవంత్ రెడ్డి. దేవాదుల, కన్నెపల్లి, కల్వకుర్తిలో 24 గంటల పాటు ఎందుకు మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తలేదు. పంపుల వద్దకు అఖిలపక్షం తీసుకుపోదాం పదా? నీ ఫెయిల్యూర్ చూపిస్తా? ఎన్ని గంటలు నడిపినవు? ఎన్ని ఎత్తినవు తెలుస్తుంది అన్నారు. కల్వకుర్తిలో 35 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉంటే 13 టీఎంసీలు నడిపినవు. మిగిలిన నీళ్లు ఏపీకి దారాదత్తం చేసినవు. నేను రుజువు చేయడానికి రెడీగా ఉన్నా పోదాం పదా.

**మన్ను తిన్న పాము లెక్క ఉన్నవ్**

గోదావరి జలాలను తరలించుకుపోయే లింకు విషయంలో చంద్రబాబు లేఖల మీద లేఖలు రాస్తున్నడు. ఢిల్లీలో మీటింగులు అటెండ్ అవుతున్నడు. నువ్వు మన్ను తిన్న పాము లెక్క కదులవు మెదులవు. ఈనెల 7న చంద్రబాబు పాటిల్ కు లేఖ రాసిండు. ఆ లేఖ గోదావరిలో తెలంగాణ హక్కులకు మరణశాసనం. లేఖ మూడో పాయింట్: ''గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు నీటిని మళ్లించే వనరుగా ఇచ్చంపల్లి లేదా సమ్మక్క సాగర్ ను గతంలో ఎన్డబ్ల్యుడీఏ ప్రతిపాదించింది.. ఈ ప్రతిపాదన ప్రకారం నీటిని డైవర్ట్ చేస్తే, ఆంధ్రప్రదేశ్ కు తీవ్ర నష్టం. ఎలాంటి లాభం లేదు. పోలవరం, ఇతర ప్రాజెక్టుల నీటి వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుంద''ని లేఖలో రాసిండు.పదేళ్ల క్రితం జరిగిన నిర్ణయాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు.ఆనాడు బిఆర్ఎస్ ప్రతిపాదిస్తే ఇది సాధ్యం అయ్యింది.ఏ రాష్ట్రానికి ఎంత నీళ్లు అనేది ఆరోజు జరిగిన మీటింగ్ లో నిర్ణయించారు.గోదావరి పరివాహక ప్రాంతాలకు ఆ మెమరాండం కూడా పంపడం జరిగింది. తెలంగాణ నుంచి తీసుకుపోవాలని అన్ని రాష్ట్రాలు ఒప్పుకున్నయి.ఇచ్చంపల్లి నుంచి తీసుకుపోయేందుకు..

2024 జూన్ 10న జరిగిన మీటింగ్ లో మధ్య ప్రదేశ్, 2024 జూన్ 11న జరిగిన మీటింగ్ లో తమిళనాడు, 2026 సెప్టెంబర్ 3న కర్ణాటక, పుదుచ్చేరిలు ఒప్పుకున్నాయి. కానీ చంద్రబాబు మాత్రం తెలంగాణకు ప్రయోజనం వద్దు అంటున్నడు.లేఖలో ఆరో పాయింట్: గోదావరి నుంచి తరలించిన నీటిని నేరుగా నాగార్జున సాగర్ రిజర్వాయర్ లోకి వదలడానికి బదులుగా, బొల్లపల్లి రిజర్వాయర్ ను వినియోగించాలని అంటడు. 150 టీఎంసీలు నింపుకుంట అంటడు.మరి తెలంగాణ హక్కులు ఏం కావాలి.సమక్క నుంచి నాగార్జున సాగర్ మీదుగా తీసుకువెళ్తే తెలంగాణకు నీళ్లు వస్తయి, కరువు వస్తే మనం వాడుకోవచ్చు. మనకు నీటి హక్కులు ఉంటయి.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా నదుల అనుసంధానం జరగాలని కేంద్రం ఒప్పుకున్నది. సరిహద్దు రాష్ట్రాలు ఒప్పుకున్నయి.మేము ముందు నుంచి ఒకటే చెబుతున్నాం. ఇచ్చంపల్లి కావేరీ లింకు విషయంలో.మా రాష్ట్రానికి 968టీఎంసీలకు మాకు అనుమతి ఇవ్వాలి, తీసుకుపోయే నీళ్లలో 50శాతం మాకు ఇవ్వాలి, మా నీళ్లు ఒక్క చుక్క ముట్టుకోకుండా ముందుకు వెళ్తే నదుల అనుసంధానంకు ఒప్పుకుంటామని స్పష్టంగా చెప్పినం.ఇప్పుడేం జరుగుతున్నది అసలు ఇచ్చంపల్లి వద్దు, పోలవరం మార్చాలి అంటున్నరు. నాగార్జున సాగర్ మీదుగా వద్దు బొల్లపల్లి తీసుకుపోతం అంటున్నరు.మనకు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి? 139 టీఎంసీలు పెండింగ్ లో ఉన్నయి. వార్ధా, సమ్మక్క, మూడో టీఎంసీలు కాంగ్రెస్ చేతగానితనం వల్ల వాపస్ చ్చింది.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా పోతే 2,38,236 ఎకరాలకు నీళ్లు అందుతాయి.ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు నీళ్లు వస్తయి. ఇది ఆనాటి కేంద్రం ఎంఓయూలో నే స్పష్టంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదన మార్చితే తెలంగాణ పరిశ్రమలకు నీళ్లు, తాగు నీరు, సాగు నీరు పరిస్థితి ఏమిటి?మొదట ఉండే రాష్ట్రం తెలంగాణ మన వాటా మనకు రాకుండా చేస్తున్నరు.చంద్రబాబు లేఖ రాసి పది రోజులు అవుతున్నా నీకు సోయి రాదు పెదవి విప్పవు.అసలు ఇంటర్ లింకింగ్ నుంచి సమ్మక్క సాగర్ ను ఎందుకు తీసేస్తున్నరు.గతంలో సమ్మక్క సాగర్ కు 45 టీఎంసీ అనుమతి ఇవ్వొద్దు, మా పోలవరంకు నష్టం అవుతుంది అని ఏపీ లేఖ రాసింది. వాళ్లు వెంటనే డీపీఆర్ వాపస్ పంపారు.లేఖలో గోదావరి కావేరి లింకు విన్ విన్ సిట్యుయేషన్ అంటున్న చంద్రబాబు గారు..ఏ విధంగా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుంది చంద్రబాబు చెబుతారా? రేవంత్ చెబుతారా? కేంద్రం చెబుతుందా ?తెలంగాణకు నష్టం చేసే ఈ ప్రతిపాదన ఎలా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుందని ప్రశ్నించారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మొన్న ఏపీకి వచ్చిండు.చేయి చేయి కలుపుదాం దక్షిణాదికి మేలు చేసుకుందాం అని మాట్లాడుకున్నరు.అసలు ఏం జరుగుతుందో తెలుసా రేవంత్ రెడ్డి.కర్ణాటకను ఒప్పించేందుకు చంద్రబాబు ఆఫర్ ఇచ్చిండు.

మేము కింద గోదావరి నీళ్లు వాడుకుంటం, పైన ఆల్మట్టిలో 16 టీఎంసీలు ఆపుకో.కానీ పోలవరం లింకుకు ఒప్పుకో అంటున్నడు. అల్రెడీ పోలవరం డైవర్షన్ లో 21 టీఎంసీలు, ఇప్పుడు 16 టీఎంసీలు అంటే 37 టీఎంసీలు కృష్ణాలో ఆగితే పాలమూరు జిల్లాకు నష్టం. ఎల్ నినో నేపథ్యంలో నీళ్ల ప్రాధాన్యం అర్థమైన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎందుకు నోరు మెదపడం లేదు? తెలంగాణ శాశ్వతంరాష్ట్ర హక్కులను కాలరాసే హక్కు నీకు లేదు రేవంత్ రెడ్డి.జాతీయ ప్రయోజనాలు అంటే ఒక రాష్ట్రానికి మేలు జరగటం కాదు. ఇచ్చంపల్లి నుంచి లింకు ప్రాజెక్టు వెళ్తే అన్ని రాష్ట్రాలకు ఉపయోగం.కానీ కేంద్రం ఏం చేస్తున్నది. చంద్రబాబు ఏం చెబితే అదే చేస్తారా 16 మంది ఎంపీలు ఉండి గడ్డి పీకుతున్నారా.ఈ ప్రతిపాదన కేంద్రం ఒప్పుకుంటే తెలంగాణ జాతికిశ్వాశ్వతంగా ద్రోహం చేసినట్లేరేవంత్ రెడ్డి ఎందుకు మౌనం? మీ మధ్య ఉన్న ఒప్పందం ఏమిటి.రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తుంటే, బిజేపీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత లేదా? కేఎల్ రావు గొప్పవారు అని ఏపీ వాళ్లు కీర్తిస్తారు. ఆ కేఎల్ రావే గోదావరి కావేరి లింకు ఇచ్చంపల్లి మీదుగా తీసుకుపోవాలని చెప్పారు. వారు చెప్పినా వినరా? ఏపీ ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు అవుతాయా?చంద్రబాబు ఎంపీలను చేతిలో పెట్టుకొని ఆడిస్తే కేంద్రం ఆడుతుందా? తెలంగాణ జాతికి మోసం చేస్తాం అంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరు. ఊరుకునే గడ్డ కాదు, ఎలాంటి పోరాటానికైనా సిద్ధం. ఈ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేస్తున్నాం.

**సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు**

సర్ ప్లస్ వాటర్ ఉందంటున్న చంద్రబాబు అసలు సర్ ప్లస్ వాటర్ ఎంతుంది, తెలంగాణ వాటా ఎంత అది తేలకుండా వాడుకుంటాం అంటే ఏమన్నట్లు? తెలంగాణ పరిస్థితి ఏమిటి? సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు. అసలు గోదావరి కావేరి నీళ్లు ఎక్కడివి అంటే.. చత్తీస్ గడ్ వినియోగించని 148 టీఎంసీలు. వీటిని గోదావరి కావేరీ లింకుకు వాడుతం అన్నరు.ఛత్తీస్గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీలను మళ్లించాలనే లక్ష్యంతో ఎన్డబ్ల్యుడీఏ గోదావరి కావేరి లింకు ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.ఈ మళ్లించే 148 టీఎంసీల జలాల్లో తెలంగాణకు 43, ఏపీకి 44, తమిళనాడుకు 42.5, పుదుచ్చేరికి 2.5, కర్ణాటకకి 16 టీఎంసీలను పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నీళ్లన్నీ నువ్వే తీసుకుపోతే తెలంగాణ ఏం కావాలి. నేషనల్ ప్రాజెక్టు అంటున్నరు. మాకు నష్టం చేసేది నేషనల్ ప్రాజెక్టు ఎలా అవుతుంది? కాళేశ్వరం, పాలమూరు నేషనల్ ప్రాజెక్టు అడిగితే మాకు ఇవ్వలేదు.తెలంగాణకు ఒక్క నేషనల్ ప్రాజెక్టు వద్దా? కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కోవాలి. రేవంత్ నోరు విప్పాలి. నిజమైన కాంగ్రెస్ నాయకులారా.. తెలంగాణ గడ్డకు పచ్చ కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఇప్పటికైనా అడ్డుకోండి.ఇకనైనా బాబుకు చేసే బానిసత్వం మానుకోవాలనీ, తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.లేదంటే కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్ళతో పెకలిస్తాం, బిజేపీకి బుద్ధి చెబుతాం అని హెచ్చరిస్తున్నాం. సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నిరుద్యోగులను నిండా ముంచిన ప్రభుత్వం

- **25వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీ**
- **కేవలం 7వేల పోస్టుల భర్తీకే నోటిఫికేషన్**
- **అరకొర పోస్టుల భర్తీ నోటిఫికేషన్తో ఏం ప్రయోజనం**
- **బీఆర్ఎస్ నేత హరీష్‌రావు విమర్శ**



హైదరాబాద్, అక్టోబర్ 17:

కాంగ్రెస్ ప్రభుత్వం తమను నిలువునా ముంచిందని, తమ ఆశలపై నీళ్లు చల్లిందని పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటని హరీష్రావు విమర్శించారు. హైదరాబాద్ లోని తన నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందించిన పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగులనుంచి వినతిపత్రం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగాల జాతర అంటూ నిరుద్యోగుల్లో ఆశలు రేపి ఓట్లు వేయించుకుని ఇప్పుడు నామమాత్రంగా పోస్టులు ప్రకటించడం అంటే యువతకు ద్రోహం చేయడమేనన్నారు. కేవలం ఏడు వేల పోస్టులతో కూడిన నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాదిమంది ఉద్యోగ అభ్యర్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారు? జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చేశారు. అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్నారు.తాజా కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు ఒక్కటి కూడా కేటాయించలేదు.చార్మినార్ జోన్ పరిధిలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు తగిన సంఖ్యలో లేకపోవడం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.పెరుగుతున్న నగర జనాభా, విస్తరిస్తున్న ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణకు అదనపు పోలీసు బలగాలు అత్యవసరం. అయినా ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని విస్మరించి నిరుద్యోగులను మోసం చేసింద అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆకాంక్షలను ఏమాత్రం నెరవేర్చలేదు అన్నది సుస్పష్టం. హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల అవేదన అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో వేలాది మంది యువత తమ సమయాన్ని, శ్రమను, ఆర్థిక వనరులను వెచ్చిస్తున్నారు. వారి ఆశలను, ఆకాంక్షలను గౌరవించండి.పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఫ్యూచర్ సిటీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఆడబిడ్డలకు సీఎం సద్దుల
# బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 17 :

సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అని రు. తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలపాటు నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతోపాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్రమంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతున్నదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

**సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక**
**ప్రజలకు, ఆడబిడ్డలకు ఉప ముఖ్యమంత్రి భట్టి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు**

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రకాల పూలు, రంగులు, సువాసనలు కలిసి అందమైన బతుకమ్మగా రూపుదిద్దుకున్నట్లే భిన్న వర్గాలు, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను ఈ పండుగ ఒక్కతాటిపైకి తీసుకువస్తుందని వివరించారు. సమాజంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ ఐకమత్యాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే విశిష్టమైన సంస్కృతికి తెలంగాణ నెలవని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమవుతూ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని, మహిళల ఆత్మగౌరవాన్ని, ప్రకృతిపై వారికున్న ఆరాధనా భావాన్ని ప్రతిబింబిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం తరతరాలపాటు కొనసాగాలని, బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి మరింత బలాన్నివ్వాలని అభిలషించారు.

## ఆహ్వానాలపై ప్రత్యేక
# దృష్టి సారించాలి

హైదరాబాద్, అక్టోబర్ 17:



తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు దోహదపడేలా ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులు, ఆయా రంగాల నిపుణులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై సచివాలయంలో శనివారం ఆయన సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమ సన్నాహాలు, ముఖ్యంగా కీలక భాగస్వాములకు ఆహ్వానాలు పంపడం, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడటంపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి, అలాగే దానికి ముందస్తు కార్యక్రమాలుగా హైదరాబాద్‌లో ఈ నెల 24న, 29న న్యూఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమాలకు ఆహ్వానాల పంపిణీ స్థితిగతులను సీఎస్ సమీక్షించారు. ఈ రెండు కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఏరోస్పేస్, అంతరిక్షం, రక్షణ రంగాలకు చెందిన సంబంధిత భాగస్వాములందరినీ ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆహ్వానించాలని ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ దేశాల రాయబారులతోపాటు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ), అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) వంటి ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులను, ఇతర రంగాల ప్రముఖులను కూడా ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని తమ బాధ్యతగా భావించి సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ ఆహ్వానితుల భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు సమష్టి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్, ఢిల్లీలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలు నిర్దేశిత లక్ష్యాలను సాధించడంతోపాటు పారిశ్రామికరంగ ప్రముఖులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాముల మధ్య ఆశించిన స్థాయిలో పరస్పర భాగస్వామ్యం, చర్చలు జరిగేలా సూక్ష్మస్థాయి ప్రణాళికలు, సమర్థవంతమైన సమన్వయం అవసరమని ఆయన పునరుద్ఘాటించారు.

## అమర పోలీసుల స్ఫూర్తితో 157మంది రక్తదానం

హైదరాబాద్, అక్టోబర్ 17:

పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు. ప్రజాసేవతోపాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. గ్రేహౌండ్స్‌లో మూడు వారాలపాటు 'జంగిల్ ఆపరేషన్స్ అండ్ సర్వైవల్ టాక్టిక్స్'లో శిక్షణ పొందుతున్న 30మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సైతం రక్తదానం చేశారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎండీ అష్ఫాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి.శంకరయ్య, జి.రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సీహెచ్.రఘునందన్‌రావు, గ్రేహౌండ్స్ వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి.మంజురెడ్డి, ఆక్టోపస్ వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు.



# విద్యార్థులు, మహిళలపై పోలీసుల వేధింపులు: రాహుల్ గాంధీ

- దిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపులు జరిగాయని విమర్శ
- బాధ్యులపై చర్యలకు ఆధారాలు సేకరించాలని సూచన
- కేరళ, రాజస్థాన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:**

ప్రజాస్వామ్యం కోసం నిరసన తెలిపిన విద్యార్థులు, మహిళలపై దిల్లీ పోలీసులు దాడులు చేయడంతోపాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల గొంతుకను అణచివేసి, ప్రశ్నించేవారిని భయపెట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారాన్ని కోల్పోతామనే భయంతోనే యువత, మహిళలపై హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
ఇటీవలి నిరసనల్లో పోలీసుల వేధింపులకు గురయ్యామని ఆరోపించిన మహిళలతో రాహుల్ మాట్లాడిన వీడియోను కూడా పంచుకున్నారు. తమపై జరిగిన దాడులు, వేధింపులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరగా, ఫొటోలు, వీడియోలు వంటి ఆధారాలను అందించాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దాడుల అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. బాధితుల ఫిర్యాదులను దిల్లీ పోలీసులు స్వీకరించలేదని ఆరోపిస్తూ, కేరళ, రాజస్థాన్‌లలో దిల్లీ పోలీసులపై జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించినట్లు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

# మహిళలతో వివాహేతర సంబంధాలు..

- ఆర్మీ మేజర్‌కు షోకాజ్ నోటీసులు
- సైనిక అధికారుల భార్యలతోనూ సంబంధాలున్నాయంటూ ఆరోపణలు
- సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ కోరిన ఆర్మీ చీఫ్
- కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలకు సిద్ధమైన సైన్యం
- చర్యలను నిలిపివేయాలన్న మేజర్ అభ్యర్థనను తిరస్కరించిన ట్రిబ్యునల్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:**

నలుగురు మహిళలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్మీ మేజర్‌పై భారత సైన్యం చర్యలకు సిద్ధమైంది. ఆయనను సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఆర్మీ చీఫ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 11 ఆర్మర్డ్ రెజిమెంట్‌కు చెందిన ఈ అధికారి ప్రస్తుతం 23 గ్రెనేడియర్స్‌కు అనుబంధంగా ఉన్నట్లు సంబంధిత పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్ట్ మార్షల్ ద్వారా విచారణ చేపట్టడానికి బదులుగా ఆర్మీ రూల్స్ 14, 19 కింద పరిపాలనా చర్యలు ఎందుకు తీసుకోకూడదో అధికారులు వివరణ కోరారు.

**భార్య ఫిర్యాదుతో మొదలైన విచారణ**

మేజర్ భార్య 2023 ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్మీ ప్రధాన కార్యాలయ డిసిప్లిన్ అండ్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు సాయుధ దళాల ట్రిబ్యునల్ (ఏఎఫ్‌టీ)లో దాఖలైన పిటిషన్ వెల్లడించింది. వివాహేతర సంబంధాలతోపాటు డ్రగ్స్ వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నట్లు తెలిపింది. ఈ ఫిర్యాదుపై 2023 అక్టోబర్‌లో 55 (I) మెకనైజ్డ్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేసింది.
అయితే, విచారణలో ఆర్మీ రూల్ 180 ప్రకారం పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించారని మేజర్ ఆరోపించారు. ఫిర్యాదులో ప్రస్తావించిన మహిళలు, వారి భర్తలను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకోవడంతోపాటు నివాసంలో నిర్వహించిన సోదాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

**కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు**

2025 మార్చిలో ఆర్మీ చట్టంలోని 45, 63 సెక్షన్ల కింద ప్రాథమిక అభియోగ పత్రాన్ని రూపొందించి, సాక్ష్యాల నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళలను కూడా విచారించాలని మేజర్ కోరినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు చేపట్టాలని సైన్యం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన ఏఎఫ్‌టీని ఆశ్రయించారు.
తన భార్య ఫిర్యాదును ఉపసంహరించుకున్నందున, గత విచారణ ఆధారంగా తీసుకుంటున్న చర్యలు చట్టవిరుద్ధమని మేజర్ వాదించారు. 2026లో తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని, రాజీ ఒప్పందంలో భాగంగా భార్య ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారని పిటిషన్‌లో వివరించారు. తగిన ఆధారాలు లేకుండానే కుటుంబ వివాదాల నేపథ్యంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారని మేజర్ తెలిపారు.
అయితే, అక్టోబర్ 14న పిటిషన్‌ను విచారించిన ఏఎఫ్‌టీ ప్రిన్సిపల్ బెంచ్.. మేజర్‌పై కొనసాగుతున్న పరిపాలనా చర్యలను నిలిపివేసేందుకు నిరాకరించింది. దీంతో ఆయనపై సైన్యం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# న్యాయం కోసం ధైర్యంగా నిలబడండి: సీజేఐ సూర్యకాంత్

- రాజ్యాంగ విలువలు, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలి
- న్యాయవాదులు నిజాయతీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి
- న్యాయవిద్యార్థులకు దేశం ఆశాకిరణాలుగా చూడాలి



**బెంగళూరు, అక్టోబర్ 17:**

న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడుతూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని సూచించారు. శనివారం బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. న్యాయవిద్య అంటే చట్టాలను నేర్చుకోవడమే కాదని, విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకుంటూ సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని పేర్కొన్నారు. వృత్తిలో సౌలభ్యం కోసం సూత్రాలను పక్కన పెట్టకూడదని, అన్యాయానికి గురైన వారికి అండగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. న్యాయవాదులు తమ వృత్తి బాధ్యతలతోపాటు దేశానికి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఎల్ఎల్‌బీ పట్టా అందుకోకముందే మరణించిన ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సంతాపం తెలిపారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, అధ్యాపకుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. న్యాయవాదులుగానే కాకుండా ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు.

# ఓవైసీని చూసి నేర్చుకోండి.. విపక్షాలకు కిరెన్ రిజిజు హితవు

- జాతీయ ప్రయోజనాల విషయంలో ఓవైసీ వైఖరిపై కేంద్రమంత్రి ప్రశంసలు
- భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైందంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్య
- మోదీపై ఎలాన్ మస్క్ విమర్శలను తప్పుబట్టిన ఎంఐఎం అధినేత





**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:**

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ప్రశంసలు కురిపించారు. ముస్లిం కేంద్రంగా సాగే రాజకీయ విధానాలను ఓవైసీ అనుసరిస్తున్నప్పటికీ, దేశ జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన హేతుబద్ధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలు ఆయన వైఖరి నుంచి నేర్చుకోవాలని సూచించారు. 'భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైంది' అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రిజిజు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

**ఎలాన్ మస్క్ వ్యాఖ్యలతో వివాదం**

ఇటీవల భారత్‌లో స్టార్‌లింక్ అనుమతుల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేసినట్లు కథనం పేర్కొంది. భారతదేశానికి నిజమైన ప్రధాని ముఖేశ్ అంబానీ అంటూ ఆయన ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపాయి. దీనిపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'ఎలాన్.. భారతదేశానికి స్వాగతం. ఆ రెండో వ్యక్తి గురించి తెలిసే వరకు ఆగు' అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ ఈ వ్యాఖ్యల ద్వారా పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని పరోక్షంగా ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.

**విదేశీ వ్యాపారవేత్తల జోక్యంపై ఓవైసీ అభ్యంతరం**

మస్క్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విధానాలను వ్యతిరేకించడం వేరు, భారతదేశ అంతర్గత వ్యవహారాలు, నిర్ణయాలపై విదేశీ వ్యాపారవేత్తలు వ్యాఖ్యలు చేయడాన్ని సమర్థించడం వేరని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. మస్క్‌కు మోదీపై రాజకీయ వ్యతిరేకత ఉండవచ్చని, అయితే ఆ కారణంతో భారత ప్రధానిపై విదేశీ పారిశ్రామికవేత్తలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని అంగీకరించకూడదని ఓవైసీ స్పష్టం చేశారు. ఈ అంశంలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలనే కిరెన్ రిజిజు ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఆవిష్కరణ

**హైదరాబాద్, అక్టోబర్ 17:**

పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి, గ్రామీణ పాలనలో పారదర్శకత, ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ పంచాయతీ మాసపత్రికను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ పత్రిక ద్వారా ప్రతి నెలా పంచాయతీరాజ్ శాఖలో జరిగే కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామీణాభివృద్ధి పనులు, ఉద్యోగుల సమస్యలు, విజయాలు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందించనున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నూతన ఆలోచనలు, సూచనలకు కూడా ప్రాధాన్యం కల్పించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండ్ తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఎడిటర్ అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ల్యాప్‌టాప్‌లు/టాబ్‌లు అందించాలని మంత్రి సీతక్కను కోరారు. వీటి ద్వారా డిజిటల్ సేవల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ నాగులూరి కృష్ణ కుమార్, అంబటి శ్రీనివాస్, టీజీఐఆర్‌డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, డిప్యూటీ సీఈవో వెంకన్న, డీఎల్పీవో సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్‌పై సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు

- పేవాల్ వెనుక ఉన్నా నిషేధిత కంటెంట్‌ను అనుమతించొద్దు
- ఉల్లంఘనలకు భారీ జరిమానాలు, అక్రమ ఆదాయం స్వాధీనం చేసుకునేలా చర్యలు
- హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపునకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు
- పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం పరిష్కారం కాదన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:**

పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సోషల్ మీడియా సంస్థలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పేవాల్ లేదా సబ్‌స్క్రిప్షన్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి కంటెంట్‌ను అందించడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడాన్ని అడ్డుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 15న ఈ ఆదేశాలు జారీ చేసింది. 2024లో ఇచ్చిన ఆదేశాల అమలులో తగిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది.

*** భారీ జరిమానాలకు ప్రతిపాదనలు**

సమాచార సాంకేతిక చట్ట నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా మధ్యవర్తులపై భారీ జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఉల్లంఘన తీవ్రత, వ్యవధి, పునరావృతం, సంస్థ వార్షిక టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. నిషేధిత కంటెంట్ ద్వారా సంపాదించిన ఆదాయాన్ని స్వాధీనం చేసుకునే విధానాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించింది.

**ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు**

పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు పర్‌సెప్చువల్ హాష్ మ్యాచింగ్, యూఆర్ఎల్ జాబితాల వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించాలని ధర్మాసనం సూచించింది. ఈ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకునేందుకు జాతీయ స్థాయి హాష్, యూఆర్ఎల్ డేటాబేస్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 15, ఐటీ చట్టంలోని సెక్షన్ 67బీ వంటి నిబంధనలను తప్పించుకునేలా ప్లాట్‌ఫామ్‌లు వ్యవహరించకూడదని స్పష్టం చేసింది.

# అభిజీత్ దీప్కే, నేహా బోరా విడుదల

- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఇంకా తిహార్ జైలులోనే
- దిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన సభ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్తో ఉద్యమం మరింత ఉధృతం
- సీఈసీ తొలగింపునకు డీఎంకే తీర్మానం

**దిల్లీ, అక్టోబర్ 17:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్లతో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనల్లో శనివారం మూడు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను దిల్లీ ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ షరతులతో షరతులతో విడుదల చే శారు. అఖిల భారత విద్యార్థి సంఘం (ఐసా) అధ్యక్షురాలు నేహాబోరా పోలీసుల నిర్బంధం నుంచి విడుదలయ్యారు. మరోవైపు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్లీలా మైదాన్ లో భారీ నిరసన సభ నిర్వహించేందుకు కాంగ్రెస్కు పోలీసులు నిరభ్యంతర పత్రం జారీ చేశారు.

**ఏడాదిపాటు శాంతిభద్రతల పూచీకత్తుపై దీప్కే విడుదల**

ఈనెల 16న కన్నాట్ ప్లేస్ లో జాతీయ పతాకాలతో నిర్వహించతలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' ప్రదర్శనకు వెళ్లకుండా అభిజీత్ దీప్కేను పోలీసులు నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆయనను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్లోని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరుపరిచారు. భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్లు 126, 170 కింద నిరోధక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం ఏడాదిపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని పూచీకత్తు సమర్పించే షరతుతో దీప్కే విడుదలకు అనుమతించారు. 10న మొదటిసారి నిర్బంధానికి గురైనప్పుడు కూడా ఆయన రూ.50 వేల పూచీకత్తు సమర్పించారు. ఆరు రోజుల వ్యవధిలో మరోసారి నిర్బంధానికి గురై కొత్త పూచీకత్తు సమర్పించాల్సి రావడం గమనార్హం. సీజేపీ న్యాయ విభాగం అధిపతి రత్నా సింగ్ ఈ నిర్బంధం చట్టబద్ధతను ప్రశ్నించారు.

**నేహా బోరా విడుదల**

ఈనెల 16న మండీ హౌస్ ప్రాంతంలో నిర్బంధానికి గురైన నేహా బోరాను శనివారం తెల్లవారుజామున విడుదల చేశారు. దిల్లీ పోలీసు చట్టంలోని సెక్షన్ 65 ప్రకారం అవస రమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. విడుదల అనంతరం నేహా బోరా పోలీసుల తీరును తీవ్రంగా విమర్శించారు. తనను నిర్బంధించిన తర్వాత న్యాయవాదులను కలుసుకునేందుకు గంటల తరబడి అనుమతించలేదని ఆరోపించారు. న్యాయవాదులు ఐదారు గంటలపాటు తనను సంప్రదించేందుకు ప్రయత్నించారన్నారు. సాధారణ పౌరులు తమ ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతున్నారని,



వారిని నేరస్థులుగా పరిగణించడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, జ్ఞానేశ్ కుమార్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసనల సందర్భంగా నిర్బంధానికి గురైన ఇతర కార్యకర్తలను కూడా విడుదల చేయాలని కోరారు.

**సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఇంకా తిహార్ జైలులోనే**

దీప్కే, నేహా బోరా విడుదలైనప్పటికీ సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడిషియల్ కస్టడీ కొనసాగుతోంది. అక్టోబర్ 13న జంతర్మంతర్ లోకి ప్రవేశించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించిన ఘటనకు సంబంధించి ఈనెల 14న వారిని ఐదు రోజుల కస్టడీకి పంపారు. సౌరవ్ దాస్ ను జైలు నంబర్ 2లోని మూడో వార్డులో, అశుతోష్ రాంకా ను జైలు నంబర్ 4లోని పదిహేనో వార్డులో ఉంచినట్లు జైలు వర్గాలు తెలిపాయి. వారి కదలికలను సీసీటీవీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

**1న రామ్ లీలా మైదాన్ లో కాంగ్రెస్ భారీ సభ**

శనివారం నాటి మరో ముఖ్యమైన పరిణామం కాంగ్రెస్ ప్రతిపా దిత భారీ సభకు దిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వడం. దిల్లీ సెంట్రల్ డీసీపీ రోహిత్ రాబీర్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 1న రామ్లీలా మైదాన్లో సభ నిర్వహించేందుకు కాంగ్రెస్కు ఎన్వోసీ జారీ చేశారు. అంతకుముందు మైదానం అందుబాటులో ఉన్న తేదీలపై దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ను కాంగ్రెస్ సంప్రదించింది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు మైదానం అందుబాటులో ఉంటుందని మున్సిపల్ అధికారులు ధ్రువీకరించారు.

**జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి: డీఎంకే తీర్మానం**

తమిళనాడులో మరో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ఎం.కె. స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో డీఎంకే పార్లమెంటరీ పార్టీ నాలుగు తీర్మానా లను ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయన వ్యవహారశైలిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

**బెంగళూరు, ముంబయిలో కొనసాగుతున్న నిరసనలు**

ఈనెల 16న దిల్లీతోపాటు బెంగళూరు, ముంబయి, పాట్నాలో కూడా సీజేపీ అనుకూల నిరసనలు జరిగాయి. బెంగళూరులో జాతీయ పతాకా లతో ప్రదర్శన నిర్వహించారు. ముంబయి, పాట్నాలో చిన్నస్థాయి కార్యక్రమాలు జరిగాయి.

# కర్నాటి స్ఫూర్తితో వామపక్ష ఐక్య ఉద్యమాలను నిర్మించాలి

- కమ్యూనిస్టు ఎజెండా లేకుంటే దేశానికి భవిష్యత్తు లేదు మోడీ పాలనకు మూడింది కాలం
- తెలంగాణలో కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్
- సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నాయకులు తమ్మినేని వీరభద్రం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం తొలి మాజీ శాసనసభ్యులు సిపిఐ సీనియర్ నేత కర్నాటి కృష్ణయ్య స్ఫూర్తితో వామపక్ష ఐక్య ఉద్యమాలను నిర్మించాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నాయకులు తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో కర్నాటి కృష్ణయ్య 28వ వర్ధంతి వేడుకలకు తమ్మినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక కృష్ణయ్య స్థూపం వద్ద చిత్రపటానికి పూల మాలలు వేసి తమ్మినేని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ కర్నాటి కృష్ణయ్య కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పనిచేసేవారని, వ్యక్తిత్వపరంగా ఆయన మృదు స్వభావం కలిగి ప్రతి ఒక్కరితో సౌమ్యంగా మాట్లాడే వారన్నారు. కమ్యూనిస్టు పార్టీలతో భిన్నాభిప్రాయాలు ఉన్న ఏనాడు కక్షపూరితంగా వ్యవహరించని నిబద్ధత కలిగిన ఉత్తమ కమ్యూనిస్టు నేత అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్ పై అమెరికా సామ్రాజ్యవాదులు చేస్తున్న దాడుల ప్రభావంతో ప్రజలపై నిత్యవసర ధరల భారం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమెరికా సామరాజవాదులనుసరిస్తున్న విధానాలపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని కమ్యూనిస్టు పార్టీల వైపు ప్రజలు అనుసరిస్తూ ఉద్యమాలలో పాల్గొంటున్నారన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఎజెండా లేకుంటే దేశానికి భవిష్యత్తు లేదని ప్రస్తుత పాలకులు అనివార్యంగా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు బలహీనపడిన మాట వాస్తవమని, అలా అని కొంతమంది కమ్యూనిస్టు వ్యతిరేకులు కమ్యూనిస్టు పార్టీకి భవిష్యత్తు లేదని చెప్పడం సరైనది కాదని, కమ్యూనిస్టు ఎజెండా లేకుంటే దేశానికే భవిష్యత్తు లేదని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీలు కోరుకునేది బూర్జువా పార్టీల మాదిరిగా వ్యవస్థను యధాతథంగా ఉంచడం కాదని, వ్యవస్థలో మార్పులు రావాలని, పేదలు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, కూలీలు ప్రతి ఒక్కరి బ్రతుకులు మారాలని ఉద్యోగం, విద్య, వైద్యం ఉద్యోగం, నీళ్లు, నిధులు, ప్రతి ఒక్కరికి దక్కాలని, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలని కోరుకుంటుందన్నారు. ఎన్నికల వ్యవస్థను డబ్బు, మద్యం, రిగ్గింగ్, ఎమ్మెల్యేల కొనుగోలు, చివరకు పేదల ఓట్లు తొలగింపు ఒంటి అంశాలతో తీవ్ర ప్రభావం చూపించాయన్నారు. ఫలితంగా ప్రజల జీవితాలు మారకపోగా రౌడీలు, గుండాలు, పారిశ్రామికవేత్తలు చట్టసభలలోకి అడుగుపెట్టి ప్రజా సంపదను కొల్లగొడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ రావాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడినా వారి అజెండా బలహీనపడలేదన్నారు. గతంలో ఢిల్లీ కేంద్రంగా ఏడాది పాటు జరిగిన రైతు ఉద్యమంలో 750 మంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తిప్పి కొట్టి విజయం సాధించారన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు, సంఘాలు ప్రగతిశీల, క్రియాశీలక పాత్ర పోషించాయన్నారు. ఢిల్లీలో జెన్జీ ఉద్యమంలో భాగంగా ప్రశ్నాపత్రాల లీకేజీ, విద్యా వ్యవస్థలో మార్పులు, హక్కుల సాధనకై జంతర్ మంతర్ ను రణభూమిగా మార్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయక తప్పలేదన్నారు. ఈ విషయాలపై కమ్యూనిస్టు పార్టీలు మొదటి నుండి చెబుతున్న ఎవరికి అర్థం కాలేదని, సమస్య తీవ్రత పెరగడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ చెప్పిన విధంగా ఉద్యమ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థలో మార్పులు, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఓట్ల తొలగింపు తదితర సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఊపొందుకున్నాయని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను తన చెప్పు చేతుల్లో ఉంచుకొని అక్రమంగా ఓట్ల తొలగింపు ప్రభుత్వాల ఏర్పాటు వంటి విధానాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారన్నారు. మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీలు చెప్పిన విధంగానే కమ్యూనిస్టుల ఎజెండానే నేడు ప్రతి ఒక్కరు అనుసరిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, మహిళలు, కూలీలు, కార్మికులు ప్రతి ఒక్కరు నుండి బిజెపి పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. బిజెపి అనుసరిస్తున్న అసమర్ధ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి చైతన్యవంతం చేయాలని తద్వారా వామపక్ష ఐక్య ఉద్యమాల ద్వారా పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను సమస్యల నుండి దృష్టి మరల్చే విధంగా డైవర్షన్ పాలిటిక్స్ పేరుతో పబ్బం గడుపుతున్నారన్నారు. కమ్యూనిస్టులు కోరుకున్నట్లు పోరాటాల కాలానికి మార్గం సుగమం కాబోతుందని, మన పెద్దలు కోరుకున్నట్లు ఉద్యమాల కాలానికి ప్రాధాన్యత పెరుగుతుందని ఎర్రకోటపై ఎర్రని జెండా ఎగరేసే రోజులు రాబోతున్నాయని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు.ఆ దిశగా రాబోయే రోజులలో సోదర వామపక్ష పార్టీలతో ఐక్య ఉద్యమాలను నిర్మించి పాలకుల ప్రజా వ్యతిరేక అసమర్ధ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నేత కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాయకులు మహమ్మద్ మౌలానా, భాగం హేమంతరావు, జమ్ముల జితేందర్రెడ్డి, కర్నాటి భాను ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి బచ్చలకూరి పుల్లయ్య, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, కె.వి.రామిరెడ్డి సిపిఐ(ఎం) నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, భూక్య కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి , మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, ఇంటూరి అశోక్, మందడపు మురళీకృష్ణ, దేగల వెంకటేశ్వరరావు, బొడ్డు మధు, సిరికొండ నాగేశ్వరరావు, కె.వి చారి, మండడి కోదండ రామారావు, పొన్నం శివరాజు, సిపిఐ నాయకులు కనకబండి సీతారాములు, మల్లె పోయిన ఉపేందర్, పాల్తీయ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హార్వెస్టర్ వాహనం కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి

**కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామం నుండి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో, మణికంఠ ట్రేడర్స్, వేబ్రిడ్జ్ సమీపంలో శనివారం (17.10.2026) రోజు సుమారు మధ్యాహ్నం 03:45 గంటల నుండి 03:55 గంటల మధ్య రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 35–40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మహిళ మృతదేహం రోడ్డుపై పడి ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో, మహిళ గత రెండు మూడు రోజులుగా ఎన్కెపల్లి చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తెలిసింది. ప్రమాద సమయంలో మహిళ హార్వెస్టర్ వాహనం (నంబర్ TG-18-9363) కు ఉన్న టోయింగ్ డ్రాబార్పై కూర్చుని ఉండగా, వాహన డ్రైవర్ గౌతమ్ దాస్ (32) ఆమెను గమనించకుండా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో, మహిళ వాహనం వెనుక టైర్ కింద పడటంతో ఆమె తలకు తీవ్ర గాయాలై, సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిసింది. హార్వెస్టర్ వాహన డ్రైవర్ గౌతమ్ దాస్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని దినాజ్పూర్కు చెందిన వ్యక్తిగా పోలీసుల విచారణలో తెలిసింది. ఈ ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలు, మృతురాలి గుర్తింపు తదితర అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు. మృతురాలికి సంబందించి ఏదైనా సమాచారం తెలిస్తే చేవెళ్ళ పోలీస్ స్టేషన్ 8712663449 కు వివరాలు తెలుపగలరని కోరారు.

# దేవీ నవరాత్రుల ఉత్సవాలు



**రామారెడ్డి,, రాజముద్ర న్యూస్:** రామరెడ్డి మండల కేంద్రంలోని గాంధీ యువజన సమైక్య 19 వ వార్షికోత్సవం సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహిస్తుంది నవరాత్రులలో ఏడవ రోజు అమ్మ వారిని లక్ష్మి దేవి గా విశేషంగా అలంకరించారు ఉదయం 9 గంటలకు వేద పండితులు జంగం దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో 21మంది దంపతులచే సామూహిక యజ్ఞం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గాంధీ యువజన సమైక్య అధ్యక్షుడు నామాల శ్రీకాంత్ సభ్యులు నోముల సాయికుమార్ ఏల్లుల నరేష్ , పిప్పరి లింబాద్రి మూడవ వార్డు మెంబర్ , నామల సత్యం, వీరితో పాటు కాశబోయిన చందు దినేష్ ,పందిరి శ్రీకాంత్, భరత్ గౌడ్ , సందీప్ గౌడ్, తదితరులు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు ఇంకా స్థానిక గురుస్వాములు, కండువా స్వాములు, కంకణ స్వాములు, బాల స్వాములు,భజన మండలి సభ్యులు, గ్రామ మహిళలు యువకులు చిన్నారులు పెద్దసంఖ్యలో తరలివచ్చి లక్ష్మీదేవి మాత ను దర్శించుకున్నారు రోజంతా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది తమ వెంట తెచ్చుకున్న 108రూపాయి నాణెములను అమ్మవారి పాదాల చింత ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు ఉత్సవ కమిటీ భక్తులందరు మహిళలు భక్తి గీతాలు కోలాటం అమ్మవారికి కీర్తించారు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాబోయే రోజుల్లో మిగిలిన అవతారాలను అలంకరణలు విజయదశమినాటి పత్రిక కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

# దేవి నవరాత్రి ఉత్సవాల్లో -మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ పూజలు

**అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్ధన**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో దేవి నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ దేవి నవరాత్రి ఉత్సవ మండపంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులతో కలిసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. జగన్మాత అమ్మవారి ఆశీస్సులు శేరిలింగంపల్లి ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సానిటేషన్ కిట్ల పంపిణీ

**పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి పురపాలక సంఘం కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సానిటేషన్ కిట్లను చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్తో కలిసి పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన రక్షణ పరికరాలను వినియోగించడం ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, కౌన్సిలర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో మూగబోయిన కలం



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ జర్నలిస్ట్ కాలనీలో ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ప్రసాదన్న అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ప్రసాదన్న పూర్తి పేరు యండమూరి వరప్రసాద్. ఈయన ఆంధ్రజ్యోతి దినపత్రిక రెండవ సారి పునఃప్రారంభమైన 2002 సంవత్సరం అక్టోబరు 15వ తేదీన పత్రికా రంగంలోకి అడుగుపెట్టారు. అప్పటి నుండి అయన మరణం వరకు ఆంధ్రజ్యోతి, సాక్షి, సూర్య తదితర పత్రికలలో బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జిగా పనిచేశారు. బాన్సువాడ ప్రాంతం జర్నలిస్టు మేధావిని కోల్పోయాం ఇది చాలా బాధాకరం.నిజామాబాద్ జిల్లాలో పేరొందిన సీనియర్ జర్నలిస్ట్ ప్రసాదన్న మరణంతో బాన్సువాడ ప్రాంతం ప్రసాదన్న మృతి చాలా బాధాకరమని, అయన ఆత్మకు శాంతి చేకూరాలని బాన్సువాడ జర్నలిస్టులు కోరుకుంటున్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , వైద్య , ఆరోగ్య శాఖ, ట్రెజరీ శాఖలు బతుకమ్మలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి మహిళలు బతుకమ్మ ఆడడం జరిగింది. మహిళా సమాఖ్య సభ్యులు కూడా పెద్ద ఎత్తున బతుకమ్మలు ఆకర్షియంగా తయారు చేసి బతుకమ్మ ఆడడం అయినది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుండి 17 అక్టోబర్ వరకు 4 రోజుల పాటు వివిధ శాఖల మహిళ ఉద్యోగులు ప్రతి రోజు కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ ఆడడం జరిగింది. 15 అక్టోబర్ తేదీన లింగంపేట మండలంలోని నాగన్న బావి వద్ద కూడా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వన్ హాజరు కాగా అదన కలెక్టర్ శ్రీ గిరి గారు ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ రవి తేజ గారు టూరిజం స్పోర్ట్స్ అధికారి వెంకట్ గౌడ్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్, డి ఆర్ డి ఓ దామోదర్, అదనపు డిఆర్డిఓ విజయలక్ష్మి గారు పాల్గొనడం అయినది. గత నాలుగు రోజులుగా శాఖల వారీగా ప్రదర్శించిన బతుకమ్మలలో ఉత్తమ బతుకమ్మలు గుర్తించి జిల్లా కలెక్టర్ గారి ద్వారా ప్రతిభ పురస్కారాలు అందజేయడం అయినది. మొదటి బహుమతి ట్రెజరీ శాఖకు అందజేయడం జరిగింది రెండవ బహుమతి ఎస్సీ ఎస్టీ బీసీ వెల్ఫేర్ శాఖకులకు మూడో బహుమతి మెప్మా వారికి కన్సోలేషన్ బహుమతులు జిల్లా పంచాయతీ కార్యాలయము డిఆర్డిఏ వారికి అందజేయడం జరిగింది. మండల సమాఖ్యలు ప్రదర్శించిన పథకంలో ఉత్తమ బతుకమ్మ ప్రదర్శనగా బిక్నూర్ మండల సమైక్యవారికి మొదటి బహుమతి దోమకొండ మండల సమైక్యవారికి రెండవ బహుమతి బీబీపేట మండల సమైక్య వారికి మూడో బహుమతి ప్రధానం చేయడమైనది. తాడువాయి, రాజంపేట, కామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల నుండి బతుకమ్మ లు తీసుకొని వచ్చి మహిళా సమాఖ్య సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం అయినది. శ్రీనిధి శాఖ నుండి ఉద్యోగులు కూడా ఉత్సాహంగా బతుకమ్మ ను తయారుచేసి పాల్గొనడం అయినది.

# పీచరలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన నిర్వహించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ, రాజేందర్, మండల ఎంసీ శంకర్, జీపీఓ అడెళ్లు, అటవీ శాఖ అధికారి జాదవ్ సుదర్శన్తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి, అవసరమైన అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తయితే గ్రామ పరిపాలనకు అవసరమైన మౌళిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో ఇక్కట్లు

- డిగ్రీ సర్టిఫికెట్లపై గెజిటెడ్ సంతకాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఫారం-18 దరఖాస్తు చేసినా తప్పని సంతకం నిబంధన
- ఉపాధి కోసం ఇతర పట్టణాల్లో ఉంటున్న యువతకు తప్పని తిప్పలు
- ఇంటివద్దకే వచ్చి వెరిఫికేషన్ చేయాలనే డిమాండ్




**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియలో యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు చర్చనీయాంశంగా మారాయి. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, డిగ్రీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం పొందడం తమకు భారంగా మారిందని పలువురు యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ ప్రాంతానికి చెందిన పలువురు యువత ఉపాధి కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు నమోదుకు అవసరమైన సంతకాల కోసం సొంత గ్రామాలకు వచ్చి, అధికారుల వద్దకు వెళ్లడం సమయం, డబ్బు వృథా కావడంతో పాటు ఉద్యోగ విధులకు కూడా ఆటంకం కలిగిస్తోందని వారు చెబుతున్నారు.

### ఆన్‌లైన్ దరఖాస్తు చేసినా తప్పని తిప్పలు..

ఫారం-18ను ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసినప్పటికీ డిగ్రీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం కోరడం ఇబ్బందికరంగా మారిందని యువత పేర్కొంటున్నారు. సంతకం పొందిన అనంతరం సంబంధిత బీఎల్‌ఓలకు ధ్రువీకరించిన కాపీని అందజేయడం కూడా కష్టంగా ఉంటోందని అంటున్నారు. చదువుకుని డిగ్రీ పట్టా పొందిన తాము నిజంగా పట్టభద్రులమేనని నిరూపించుకోవడానికి మళ్లీ అధికారుల సంతకాల కోసం తిరగాల్సి రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### ఇంటి వద్దే ధ్రువీకరణ చేపట్టాలి..

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని యువత కోరుతున్నారు. అవసరమైన వివరాలు, సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో సమర్పించిన అభ్యర్థుల వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైతే ఇంటి వద్దకే వచ్చి వెరిఫికేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న యువతకు ఇబ్బందులు కలగకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.పట్టభద్రుల ఓటరు నమోదులో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా అధికారులు స్పందించి, ధ్రువీకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని యువత విజ్ఞప్తి చేస్తున్నారు.

# అమరవీరుల స్మారక ప్రీమియర్ లీగ్ టోర్నీ ప్రారంభం



**రాజముద్ర న్యూస్, బెజ్జూర్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల స్మారకార్థం బెజ్జూర్ మండల్ ప్రీమియర్ లీగ్ (బీఎంపీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. మండలంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడం, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా తెలంగాణ జావిద్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారి పేరిట క్రీడా టోర్నీ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇది యువతలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, దేశభక్తిని నింపుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కొండ్ర జగ్గా గౌడ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, ఒత్తిడిని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని తమ గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. బెజ్జూర్ ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి ఉంటేనే విజయం సాధ్యమవుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. బీజేపీ నాయకులు సామల తిరుపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, సరైన వేదిక లేక వెనుకబడుతున్నారన్నారు. ఇలాంటి మండల్ స్థాయి టోర్నీలు వారి ప్రతిభను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్ ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ కవ్వాల సాయి, కాంగ్రెస్ నాయకులు కొండ్ర జగ్గా గౌడ్, మండల అధ్యక్షులు శ్రీవర్ధన్, బీజేపీ నాయకులు సామల తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు బూస సారయ్య, అమీరుద్దీన్, నిర్వాహకులు సురేష్ గౌడ్, వైకుంఠం, కాజా శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ.. ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్!

- సిరిసిల్లలో భగ్గుమన్న నిరసనలు..
- అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయింపు
- విలేకరులపై పోలీసుల దాడిని నిరసిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆందోళన
- రోడ్డుపై బైఠాయించిన విశారదన్ మహారాజ్..
- నిలిచిపోయిన ట్రాఫిక్
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి వినతిపత్రం
- విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో ఎస్సైపై వేటు




**రాజముద్ర న్యూస్, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో జర్నలిస్టులపై ఎస్సై శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. విలేకరులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ శనివారం సిరిసిల్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు గంభీరావుపేట ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**అంబేద్కర్ చౌరస్తాలో ఉద్రిక్తత**

గంభీరావుపేటలో విలేకరులపై దాడిని నిరసిస్తూ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్న నిరసనకారులు రహదారిపై బైఠాయించి పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తీవ్రమైన అంశమని, బాధ్యులను ఉపేక్షించరాదని డిమాండ్ చేశారు. నిరసనల కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో చౌరస్తా పరిసరాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

**ఎస్పీకి వినతిపత్రం అందజేత**

విలేకరులపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై జరిగిన ఘటనను సమగ్రంగా విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

**ఎస్సై శ్రీకాంత్‌పై సస్పెన్షన్ వేటు**

ఈ పరిణామాల నేపథ్యంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ, జోన్–3 రాజన్న డీఐజీ ఇన్‌చార్జ్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనతోపాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై భౌతిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటరాదు**

ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా సాయుధ రిజర్వు ప్రధాన కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్ కాలంలో ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడి ఆరోపణల నేపథ్యంలో ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఆరోపణలపై తదుపరి విచారణలో పూర్తి వివరాలు తేలాల్సి ఉంది.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- డివిజన్-3 జనరల్ సెక్రటరీగా ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



**రాజముద్ర న్యూస్, జవహర్‌నగర్:** డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని జవహర్‌నగర్ డివిజన్–3 కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ డివిజన్–3 కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి కమిటీ నియామకాల్లో భాగంగా సీనియర్ నాయకుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, మాజీ మేయర్‌కు, డివిజన్ అధ్యక్షుడు దొంతగాని శాంతి కొటేష్ గౌడ్‌కు, పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జవహర్‌నగర్ డివిజన్–3 పరిధిలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్, కొలిపాక సాయికిరణ్, కన్నబోయిన రాజు యాదవ్, గండి సునీత, రేణుక, నాచారం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీకి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న శ్రీకర్





**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ 0418 యూనిట్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్యాల శ్రీకర్ మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ గర్భిణీకు సకాలంలో రక్తం అందేలా చర్యలు చేపట్టి ఆమెకు అండగా నిలిచారు. గర్భిణీకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలుసుకున్న శ్రీకర్ వెంటనే స్పందించారు. కులమతాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా తన యూనిట్ సభ్యులతో సమన్వయం చేసుకుని రక్తదానానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులు టేకుల అశోక్, దొమ్మటి కైలాష్ రక్తదానం చేసి బాధిత మహిళకు సహకరించారు. ఎవరో తెలియని వ్యక్తి కష్టాన్ని తమ కష్టంగా భావించి సాయం అందించిన శ్రీకర్, రక్తదానం చేసిన యూనిట్ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రశాంత్ కళ్లెపెల్లి, హ్యూమన్ రైట్స్ యూనిట్ సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ లో అచలాపూర్ విద్యార్థినికి కాంస్య పతకం

**ఎస్ జీఎఫ్ అండర్ -17 పోటీల్లో శ్రీవల్లి ప్రతిభ**



**రాజముద్ర న్యూస్, తాండూర్:** పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అచలాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.శ్రీవల్లి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల పీడీ సాంబమూర్తి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మైత్రి గ్రౌండ్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శ్రీవల్లి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పతకం సాధించిన శ్రీవల్లిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యుడు పాపయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దుర్గామాతను దర్శించుకున్న బెల్లంపల్లి ఏరియా జీఎం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** దుర్గా నవరాత్రుల సందర్భంగా బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాలో నూతన మైనింగ్ ప్రాజెక్టులు, ఓపెన్‌కాస్ట్ గనులు త్వరగా ప్రారంభం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి బూర శ్రీనివాస్, వర్క్‌షాప్ కార్యదర్శి కందుల తిరుపతి, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి కె.భీమేష్, నాయకులు సత్యనారాయణ, పోశం, రాజేష్, ఏఐటీయూసీ నాయకుడు కోడెం అశోక్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, వర్క్‌షాప్ అధికారి జ్ఞానేశ్వర్, నరేష్, ఏరియా ఇంజనీర్ వీరన్న, కైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, మేనేజర్ శంకర్, ఏరియా సర్వే అధికారి వినోద్ కుమార్, జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ముంబై ఇండియన్స్‌కు కొత్త కోచ్!

**ముంబై, అక్టోబరు 17 :** ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్ సాధించిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. జట్టు ప్రధాన కోచ్ మహేల జయవర్ధనేతో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని ఫ్రాంచైజీ నిర్ణయించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటనను ధ్రువీకరించాల్సి ఉంది. గత ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. జట్టు ప్రదర్శనలో నిలకడ లేకపోవడం, ఆటగాళ్ల గాయాలు, కొందరు కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు కూడా అప్పట్లో చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాబోయే సీజన్ కోసం కొత్త ప్రధాన కోచ్‌ను నియమించే అంశంపై ఫ్రాంచైజీ దృష్టి సారించినట్లు సమాచారం. కొత్త కోచ్ ఎంపిక కోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తదుపరి కోచ్ ఎవరనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మహేల జయవర్ధనేకు ముంబై ఇండియన్స్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 2017లో జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మార్గదర్శకత్వంలో ముంబై 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది. దీంతో ఫ్రాంచైజీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన కోచ్‌లలో ఆయన ఒకరిగా గుర్తింపు పొందాడు. జట్టు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులతో కలిసి ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించుకున్నామని జయవర్ధనే పేర్కొన్నట్లు సమాచారం. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు కృతజ్ఞతలు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ముంబై ఇండియన్స్‌కు జయవర్ధనే అందించిన సేవలను నీతా అంబానీ ప్రశంసించినట్లు సమాచారం. ఆయన ఎప్పటికీ తమ 'వన్ ఫ్యామిలీ'లో భాగమేనని ఆమె పేర్కొన్నట్లు కథనాలు తెలిపాయి. కోచ్‌గా ఆయన సాధించిన విజయాలు, జట్టుతో ఏర్పరచుకున్న అనుబంధం ముంబై ఇండియన్స్ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. కొత్త కోచ్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడితేనే జట్టు తదుపరి ప్రణాళికలపై స్పష్టత రానుంది.

## ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా చమిందా వాస్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** ఐపీఎల్ తదుపరి సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తన కోచింగ్ బృందాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. శ్రీలంక మాజీ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ చమిందా వాస్‌ను జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన వాస్ అనుభవం జట్టు పేస్ విభాగానికి ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది. చమిందా వాస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోని మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, ముకేశ్ కుమార్, దుష్మంత చమీర వంటి పేసర్లతో కలిసి పనిచేయనున్నారు. ఎడమచేతి వేగంతో పాటు బంతిని స్వింగ్ చేయడంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వాస్, బౌలర్లకు సాంకేతికంగా మెరుగైన శిక్షణ అందించగలరు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ వ్యూహాలను రూపొందించడంలోనూ ఆయన అనుభవం జట్టుకు తోడ్పడే అవకాశం ఉంది. శ్రీలంక తరఫున సుదీర్ఘకాలం ఆడిన చమిందా వాస్ మూడు ఫార్మాట్లలో కలిపి 439 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టెస్టుల్లో 355 వికెట్లు, వన్డేల్లో 400 వికెట్లు సాధించారు. బంతిని స్వింగ్ చేస్తూ కీలక సమయాల్లో వికెట్లు తీయడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి భారత బ్యాటర్లకు కూడా ఆయన పలుమార్లు సవాలు విసిరారు. ఆటగాడిగా ఐపీఎల్‌లోనూ వాస్‌కు అనుభవం ఉంది. డెక్కన్ ఛార్జర్స్ తరఫున ఆడిన ఆయన, లీగ్‌లో తన బౌలింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆటగాడిగా సంపాదించిన అనుభవంతో పాటు కోచ్‌గా పనిచేసిన పరిజ్ఞానం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడనుంది. ఈ నియామకంతో రాబోయే సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పేస్ బౌలింగ్ మరింత పటిష్ఠం కావాలని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే జట్టు ప్రదర్శనపై ఈ మార్పు ఎలాంటి ప్రభావం చూపుతుందో సీజన్ ప్రారంభమైన తర్వాతే స్పష్టమవుతుంది.




## అంతర్జాతీయ క్రీడా టోర్నీలకు 50 కోట్ల సాయం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని ప్రకటించినట్లు సమాచారం. అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరచడంతో పాటు, దేశాన్ని ప్రపంచ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా, దేశంలో అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించే జాతీయ క్రీడా సమాఖ్యలకు పోటీల స్థాయిని బట్టి గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం కింద వివిధ క్రీడా విభాగాలకు వాటి అంతర్జాతీయ ప్రాధాన్యం, సాధించిన విజయాలు, పోటీల స్థాయిని బట్టి ఆర్థిక సాయం కేటాయించనున్నట్లు సమాచారం. ఒలింపిక్స్ లేదా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన క్రీడలకు సంబంధించిన అంతర్జాతీయ పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు అందించే అవకాశం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో టాప్-16 ర్యాంకింగ్స్‌లో ఉన్న క్రీడలకు రూ.20 కోట్లు, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన ఇతర క్రీడలకు రూ.10 కోట్ల వరకు సాయం అందించనున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ మొత్తాలు, అర్హత ప్రమాణాలను సంబంధిత అధికారిక మార్గదర్శకాలతో ధ్రువీకరించాల్సి ఉంది. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన లేదా పాల్గొనే ఒలింపిక్ క్రీడా విభాగాలకు సంబంధించిన పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.20 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు సమాచారం. ఈ నిధులు అంతర్జాతీయ పోటీలను దేశంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లకు ఉపయోగపడనున్నాయి. ఈ ఆర్థిక సాయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయడం, పోటీదారులకు మెరుగైన వసతి, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడం వంటి ఏర్పాట్లకు అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ టోర్నీల నిర్వహణ పెరిగితే భారత క్రీడాకారులకు స్వదేశంలోనే ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీపడే అవకాశం లభిస్తుంది. అలాగే, క్రీడా రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, నిర్వహణ నైపుణ్యాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అయితే పథకం అమలు, నిధుల మంజూరు, అర్హత ప్రమాణాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను పరిశీలించాల్సి ఉంది.



## జైస్వాల్‌కు అన్యాయం చేశారు: అశ్విన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** న్యూజిలాండ్ పర్యటన కోసం ప్రకటించిన భారత వన్డే జట్టులో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కకపోవడంపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా పరుగులు సాధించే సత్తా ఉన్న ఆటగాడికి తగిన అవకాశాలు కల్పించకపోవడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఇలాగే కొనసాగితే జైస్వాల్ ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు ప్రకటించిన జట్టులో జైస్వాల్‌కు చోటు దక్కకపోవడాన్ని అశ్విన్ తప్పుబట్టాడు. శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేని పరిస్థితి ఎదురైతే అతడి స్థానంలో జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశాలు కల్పించడం జట్టు యాజమాన్యం, సెలెక్టర్ల బాధ్యతని పేర్కొన్నాడు. జైస్వాల్ గతంలో పరుగుల వరద పారించిన ఆటగాడని గుర్తుచేస్తూ, ప్రస్తుతం అతడికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం లేదని అశ్విన్ ఆందోళన వ్యక్తం చేశాడు. కేవలం అవకాశాల కోసం మాట్లాడటం లేదని, ఆటగాడి ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు దృష్ట్యా ఈ విషయం ముఖ్యమని వివరించాడు. గత రెండేళ్లలో జైస్వాల్ బ్యాటింగ్‌లో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అతడు తిరిగి తనదైన లయను అందుకోవాలంటే తగినంత మ్యాచ్ సమయం, జట్టు మద్దతు అవసరమని చెప్పాడు. టెస్టు క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని అంగీకరిస్తూనే, ఇతర ఫార్మాట్లలోనూ ఆడే అవకాశాలు కల్పించాలని సూచించాడు. జైస్వాల్ చివరిసారిగా ఎప్పుడు వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడాడనే విషయాన్ని కూడా అశ్విన్ ప్రస్తావించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం ఆటగాడికి ఎంతో విలువైనదని పేర్కొన్నాడు. తాను సెలెక్షన్ కమిటీలో ఉండి ఉంటే జైస్వాల్‌ను పిలిచి, రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నావా? అని అడిగేవాడినని అశ్విన్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం కంటే గొప్పది మరొకటి లేదని అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జట్టు భవిష్యత్తును బలోపేతం చేయవచ్చన్నది అశ్విన్ వ్యాఖ్యల సారాంశం. జైస్వాల్‌కు రాబోయే రోజుల్లో ఏ ఫార్మాట్‌లో అవకాశాలు లభిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.



## కోహ్లీని అహంకారి అనుకున్నా..

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వ్యక్తిత్వంపై దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీని తొలిసారి కలిసినప్పుడు అతడిని అహంకారిగా భావించానని వెల్లడించాడు. అయితే, అది అహంకారం కాదని, తన సామర్థ్యంపై కోహ్లీకి ఉన్న బలమైన నమ్మకమే అలా కనిపించడానికి కారణమని వివరించాడు. వయసు పెరిగే కొద్దీ కోహ్లీలో వ్యక్తిత్వ పరంగా ఎంతో పరిణతి వచ్చిందని పేర్కొన్నాడు. ప్రఖర్ గుప్తాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో డివిలియర్స్ ఈ విషయాలను పంచుకున్నాడు. కోహ్లీని మొదటిసారి కలిసినప్పుడు అతడిని నిజంగానే అహంకారిగా, పొగరుబోతుగా భావించారా? అని అడగ్గా.. అవునని సమాధానమిచ్చాడు. ఈ విషయం కోహ్లీకి కూడా తెలుసని, తాను ఈ వ్యాఖ్యలను సరదాగానే చెబుతుంటానని వివరించాడు. 19 నుంచి 21 ఏళ్ల వయసులో కోహ్లీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉండేవాడని డివిలియర్స్ తెలిపాడు. తన సామర్థ్యంపై అతడికి గట్టి నమ్మకం ఉండేదని, అదే కొన్నిసార్లు ఇతరులకు అహంకారంలా కనిపించేదని చెప్పాడు. ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఆటగాడికి తనపై తనకు నమ్మకం ఉండటం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున కలిసి ఆడిన కోహ్లీ, డివిలియర్స్ మధ్య మంచి స్నేహం ఏర్పడింది. మైదానంలో భాగస్వామ్యాలతో పాటు మైదానం బయట కూడా వీరిద్దరి అనుబంధం కొనసాగింది. దీంతో కోహ్లీ ఆటతీరును, వ్యక్తిత్వాన్ని దగ్గరగా గమనించే అవకాశం డివిలియర్స్‌కు లభించింది. కాలక్రమంలో కోహ్లీలో ఎంతో మార్పు వచ్చిందని డివిలియర్స్ పేర్కొన్నాడు. చిన్న వయసులో తనను తాను నిరూపించుకోవాలనే తపన ఎక్కువగా ఉండేదని, విజయాలు సాధిస్తూ ముందుకు సాగిన కొద్దీ ఆ అవసరం తగ్గిందని వివరించాడు. ప్రస్తుతం కోహ్లీ వ్యక్తిగా, క్రికెటర్‌గా మరింత పరిణతి సాధించాడని తెలిపాడు. డివిలియర్స్ వ్యాఖ్యలు కోహ్లీ కెరీర్‌లోని ఎదుగుదలను, ఆత్మవిశ్వాసం నుంచి పరిణతి వైపు సాగిన అతడి ప్రయాణాన్ని మరోసారి చర్చకు తీసుకొచ్చాయి.




## వైభవ్ పోస్ట్ వైరల్.. తుది టీ20లో ఛాన్స్ దక్కేనా?

**బెంగళూరు, అక్టోబరు 17:** భారత్, వెస్టిండీస్ మధ్య టీ20 సిరీస్ తుది పోరుపై ఆసక్తి నెలకొంది. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో సమంగా నిలవడంతో చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. ఈ కీలక సమయంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ పోస్టు చర్చకు దారితీసింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాని వైభవ్.. చివరి టీ20లోనైనా బరిలోకి దిగుతాడా అన్న ఉత్కంఠ అభిమానుల్లో పెరిగింది. భారత జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ తొలి నాలుగు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఓపెనర్లుగా సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు జట్టు యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వడంతో అతడికి తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'స్టిల్ బిలీవింగ్' అనే అర్థం వచ్చేలా పోస్టు పెట్టినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అంటే, 'ఇప్పటికీ నమ్మకంతోనే ఉన్నా' అనే భావం. ఈ పోస్టుతో చివరి మ్యాచ్‌లో అతడికి అవకాశం దక్కుతుందా? అనే చర్చ మొదలైంది. అయితే ఈ పోస్టు జట్టు ఎంపికకు సంబంధించినదేనని నిర్ధారించలేం. సిరీస్ విజయం కోసం భారత్ చివరి మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ఇలాంటి కీలక పోరులో జట్టు యాజమాన్యం ఓపెనింగ్ జోడీని మారుస్తుందా? లేక ఇప్పటికే ఆడుతున్న ఆటగాళ్లకే మరో అవకాశం ఇస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గతంలో జట్టు ఎంపికలో ఆటగాళ్ల ఫామ్‌తో పాటు జట్టు సమతూకం, వ్యూహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి. అందువల్ల వైభవ్ మంచి ప్రతిభ కలిగిన ఆటగాడైనా, తుది జట్టులో చోటు దక్కడం ఖాయమని చెప్పలేం. వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో జట్టు యాజమాన్యం ఎలాంటి కూర్పుతో బరిలోకి దిగుతుందనేది టాస్ సమయంలోనే స్పష్టమవుతుంది. వైభవ్‌కు అవకాశం ఇస్తారా? లేక ప్రస్తుత ఓపెనింగ్ జోడీనే కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాలి.



రాజముద్ర

# 'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల!



**హైదరాబాద్, అక్టోబరు 17 :** ప్రేమ, పెళ్లి, కెరీర్, స్వతంత్ర జీవనం.. నేటి యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ సినిమాతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా పతాకంపై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'అప్పుడే పెళ్లా' పాటకు సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభించగా, తాజాగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ప్రేమ, పెళ్లి విషయంలో నేటి తరం ఎదుర్కొంటున్న సందిగ్ధతలు, కెరీర్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, స్వతంత్రంగా జీవించాలనే ఆలోచనలను ఈ చిత్రంలో చూపించనున్నట్లు దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల తెలిపారు. టీజర్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత జీవితాల్లో ఎదురయ్యే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశామని చెప్పారు. సినిమాలోని పాత్రలతో యువత సులభంగా అనుసంధానమవుతారని, కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరితో పాటు పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబీ తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మరేఖ, శ్రీదేవి ఆగ్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి తదితరులు నటిస్తున్నారు. విజయ్ సి. కుమార్ ఛాయాగ్రహణం అందించగా, వరికుప్పల యాదగిరి సంగీతం, పాటలను సమకూర్చారు. ప్రవీణ్ ఇమ్మడి నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఆవుల వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, మోహన్ జల్లా కళా దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ నృత్యరీతులు సమకూర్చారు. మాదం దయానంద్, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామశర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. 'అప్పుడే పెళ్లా' పాటతో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుకున్న 'ఐ హేట్ మ్యారేజ్'.. టీజర్‌తో మరింత చర్చలోకి వచ్చింది. యువత ప్రేమ, పెళ్లి, జీవిత నిర్ణయాలపై ఈ సినిమా ఎలాంటి కథనాన్ని అందిస్తుందో చూడాలి.



# యోధురాలిగా సాయిపల్లవి..

## 'రామాయణం' ప్రోమోపై ఆసక్తి!

**హైదరాబాద్, అక్టోబరు 17 :** నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం' మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ సినిమాలో సీతాదేవిగా నటిస్తున్న సాయిపల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ఈ కొత్త ప్రచార చిత్రంలో సీత పాత్రను విభిన్నంగా చూపించారంటూ అభిమానులు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వెండితెరపై సీతాదేవి పాత్రను సహనం, త్యాగం, కుటుంబ విలువలకు ప్రతీకగా చూపిస్తుంటారు. అయితే ఈ చిత్రంలో ఆమె ధైర్యసాహసాలను కూడా ఆవిష్కరించేలా రూపకల్పన చేసినట్లు ప్రచార చిత్రంలోని దృశ్యాలు సూచిస్తున్నాయి. చేతిలో కత్తితో యోధురాలిగా సాయిపల్లవి కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, యశ్ రావణుడిగా, సాయిపల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీత బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రణాళిక రూపొందించింది. 'రామాయణం' విడుదల తేదీ, తాజా ప్రచార చిత్రానికి సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటనలను పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా నవంబర్ 5న దీపావళి సందర్భంగా తొలి భాగం విడుదల కానుందన్న ప్రచారానికి అధికారిక ధృవీకరణ అవసరం. సీతాదేవి పాత్రలో సాయిపల్లవి కనిపించనున్న తీరు మాత్రం అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# విజయ్ సేతుపతి 'స్లమ్‌డాగ్' షూటింగ్ పూర్తి!

**హైదరాబాద్, అక్టోబరు 17 :** క్రేజీ దర్శకుడు పూరి జగన్నాథ్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కలయికలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్–33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. త్వరలోనే విడుదల తేదీని వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ సేతుపతి నటనకు పూరి జగన్నాథ్ ప్రత్యేకమైన కథనశైలి తోడవడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. షూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం నిర్మాణానంతర పనులపై దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. విడుదల తేదీతో పాటు ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. విజయ్ సేతుపతి–పూరి జగన్నాథ్ కలయికలో వస్తున్న ఈ చిత్రం ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందోనన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



## 'జనవరి 12 విడుదల'లో కీర్తి సురేశ్..

# పవర్‌ఫుల్ పాత్ర!

**హైదరాబాద్, అక్టోబరు 17 :** టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల' చిత్ర బృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె 'లతా రెడ్డి' అనే విభిన్నమైన, శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ పోస్టర్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. వెంకటేశ్ కథానాయకుడిగా, నందమూరి కల్యాణ్ రామ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మాస్, కుటుంబ వినోద అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేశ్ పాత్ర కథలో కీలకంగా నిలవనుందని చిత్ర వర్గాల సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన తాజా అప్‌డేట్‌తో సినిమాపై అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు నెలకొన్నాయి. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. 'జనవరి 12 విడుదల' చిత్రాన్ని 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఆడిషన్ లేకుండానే..

**హైదరాబాద్, అక్టోబరు 17 :** ఇతర భాషల నుంచి వచ్చి టాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా తెలుగు భాష తెలియని సమయంలో ఆడిషన్స్‌కు హాజరవడం నటీనటులకు సవాలుతో కూడుకున్నదే. అయితే మలయాళ నటి అనశ్వర రాజన్‌కు మాత్రం తన తొలి తెలుగు సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అనుభవం ఎదురైంది. 'ఛాంపియన్' సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లినప్పుడు తనను ఎంపిక చేయలేదని భావించానని, చివరకు ఆడిషన్ అవసరం లేకుండానే అవకాశం దక్కిందని ఆమె గుర్తుచేసుకుంది. 'ఛాంపియన్' సినిమా కోసం 2024 ఏప్రిల్‌లో చిత్ర నిర్మాణ సంస్థ నుంచి తనకు ఫోన్ వచ్చిందని అనశ్వర రాజన్ తెలిపింది. ఆ తర్వాత నిర్వహించిన లుక్ టెస్ట్ కోసం హాఫ్ శారీ ధరించి వెళ్లినట్లు వెల్లడించింది. అక్కడ నిర్మాత సాయి, సహాయ దర్శకుడు తనకు కొన్ని సంభాషణలతో కూడిన స్క్రిప్ట్ ఇచ్చి సాధన చేయాలని సూచించారట. తనకు తెలుగు రాదని చెప్పడంతో, ఆంగ్లంలోనే సంభాషణలు చెప్పవచ్చని వారు భరోసా ఇచ్చినట్లు అనశ్వర తెలిపింది. దీంతో అక్కడే డైలాగ్స్ సాధన చేస్తూ ఆడిషన్‌కు సిద్ధమైంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం కూడా అక్కడే ఉన్నారని ఆమె గుర్తుచేసుకుంది. అనశ్వర సంభాషణలు సాధన చేస్తున్న సమయంలో స్వప్న దత్ అక్కడికి వచ్చి ఆమెను చూసి ఓకే అని చెప్పి వెళ్లిపోయారట. ఆ తర్వాత దర్శకుడు ప్రదీప్ అద్వైతం, నిర్మాత సాయి సహా అక్కడున్నవారంతా వెళ్లిపోయారు. కొద్దిసేపటికి తిరిగి వచ్చిన నిర్మాత సాయి.. ఆడిషన్ అవసరం లేదని, ఇక సంభాషణలు చెప్పాల్సిన పని లేదని చెప్పారట. దీంతో అనశ్వర అయోమయానికి గురైందట. తనను ఎంపిక చేయలేదని, సినిమా నుంచి తప్పించేశారని భావించి ఇంటికి వెళ్లిపోవచ్చని అనుకుందట. కారణం ఏమిటని పదేపదే అడిగినా, ఆడిషన్ అవసరం లేదనే సమాధానమే రావడంతో అసలు విషయం అర్థం కాలేదని ఆమె వెల్లడించింది. చివరకు తనను ఎంపిక చేసినందువల్లే ఆడిషన్ అవసరం లేదని తెలుసుకున్న అనశ్వర ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తిరస్కరణ ఎదురైందని భావించిన సమయంలోనే సినిమా అవకాశం దక్కిందని తెలిసి ఎంతో సంతోషించానని ఆమె తెలిపింది. మలయాళ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్'తో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. తన తొలి తెలుగు సినిమా ఎంపిక వెనుక ఉన్న ఈ అనుభవం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,**
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com